క్లుప్తంగా

ఆలయాల నిర్మాణానికి విరాళం



ఆలయాల నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందజేస్తున్న డా.బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న బంజారాహిల్స్‌లో నూతనంగా నిర్మిస్తున్న మారెమ్మగుడి, సత్‌సేవాలాల్ దేవస్థానాలకు ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని దేవస్థానం కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం అక్కడ ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. డా. బత్తల హరిప్రసాద్‌కు బంజరాలు దుశ్శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు జెడ్పీటీసీ కృష్ణానాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, సర్పంచ్ చలపతినాయక్, వీరేనాయక్, శ్రీనివాసులు, కాంట్రాక్టర్ బాబా, చికెన్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మె జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

కదిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. కదిరి సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించిందన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడి దారులకు దోచిపెట్టడానికే ఈ చట్టాలను సవరించిందన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగి ప్రజలు కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20 న తలపెట్టిన సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్.నరసింహులు, జగన్, ముస్తాక్, రామ్మోహన్, సాంబశివ, బాబ్జాన్, ఉదయ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం షిర్డీసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటిచూపు తగ్గిన 135 మందికి పరీక్షలు చేసి 50మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు సమితి అధ్యక్షుడు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, బంధనాథం సూర్యప్రకాష్ తెలిపారు.

ఘనంగా సీతారామ విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న సీతారాములు

ముదిగుబ్బ: మండలంలోని బి.కొట్టాల గ్రామంలో ఆదివారం సీతారామ లక్ష్మణ, హనుమ సమేత విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెద్దబయన్న సుబ్బిశెట్టి, రామకృష్ణ, రామచంద్ర, చిన్నబయన్న, శేఖర్, కృష్ణయ్య, నాగరత్నం, ఎల్ఐసీ రమణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని ప్రసిద్ధ శైవక్షేత్రం హేమావతిలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామికి ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. సిద్ధేశ్వర స్వామికి త్రికాల పూజలైన సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు చేశారు. అనంతరం వివిధ రకాల పూలమాలలతో స్వామిని చూడముచ్చటగా ప్రత్యేకంగా అలంకరించారు. మహామంగళ హారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

సంపద సృష్టించేదెన్నడు?

- నిరుపయోగంగా చెత్త సంపద తయారీ కేంద్రాలు
- నెరవేరని ప్రభుత్వ లక్ష్యం



నల్లమాడలోని చెత్త సంపద తయారీ కేంద్రం

నల్లమాడ: గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను సేకరించి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో 2014–18 మధ్య అప్పటి ప్రభుత్వంలో ప్రతి పంచాయతీకి ఒకటి చొప్పున చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించింది. ఇందులో శ్రీ సత్యసాయి జిల్లాలో 400పైగా చెత్త సంపద తయారీ కేంద్రాలు నిర్మించినట్లు అధికారిక సమాచారం. అధికశాతం పంచాయతీల్లో చెత్తతో సంపద తయారీ కార్యరూపం దాల్చకపోవడంతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి.

కానరాని చెత్త సేకరణ..

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా చెత్తను సేకరించి దాన్ని సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి. అక్కడ తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి వేర్వేరు తొట్టెల్లో నిల్వచేయడం ద్వారా కంపోస్టుగా తయారు చేయాలి. కంపోస్టు ఎరువును విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఇందు కోసం పంచాయతీల్లో జనాభా ఆధారంగా చెత్త సేకరణకు క్లాప్ మిత్రలను నియమించి వారికి రిక్షాలను కూడా అందజేశారు. అయితే చాలా పంచాయతీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడం, చెత్తతో సంపద తయారీకి అవసరమైన నీటి వసతి లేకపోవడంతో అధికశాతం సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయన్న అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

కోట్ల రూపాయల ప్రజాధనం వృథా

గ్రామీణ జాతీయ ఉపాధి హామీ కింద సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఇందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అధికశాతం పంచాయితీల్లో సంపద తయారీ జరగకపోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చకపోవడంతో దోమలు బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని పంచాయితీల్లోను చెత్తతో సంపద తయారీకి అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



చెత్తతో సంపద తయారీకి అవసరమైన వసతులు ప్రభుత్వం కల్పించాలి. చాలా సంపద కేంద్రాల వద్ద నీటి వసతి లేదు. చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చాలంటే నీటి అవసరం ఎంతైనా ఉంది. గ్రామాల్లో ప్రతిరోజు చెత్తను సేకరించేలా పంచాయితీ పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

–మల్లెల గంగాధర్, ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి

ఎరువుల తయారీతో ఉపయోగం



చెత్తతో తయారైన సేంద్రీయ ఎరువులు అందుబాటులో ఉంటే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నేడు పంటల సాగులో సేంద్రీయ ఎరువుల వాడకం పెరిగింది. సేంద్రీయ ఎరువుల వినియోగంతో కల్తీ లేని దిగుబడులు లభిస్తాయి. నేల కూడా సారవంతమవుతుంది. చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా విరివిగా సేంద్రీయ ఎరువుల తయారీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–వనం శ్రీనివాసరెడ్డి, చౌటకుంటపల్లి, నల్లమాడ మండలం

మామిడి రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: జిల్లాలో రెండు రోజుల క్రితం గాలివాన సృష్టించిన బీభత్సంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి గాలి వానకు మామిడి కాయలు నేలకొరిగాయన్నారు. అప్పులు చేసి పంటకు పెట్టుబడులు పెట్టిన రైతులకు కూలి ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఉద్యానశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి మామిడి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కమిటీ సభ్యుడు మారుతి, సీఐటీయూ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, జేవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



హనుమంతరెడ్డిని సన్మానిస్తున్న శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సూచించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఇటీవల కొత్తగా నియమితులైన డాక్టర్ల విభాగం అధ్యక్షుడు, కొత్తచెరువుకు చెందిన హనుమంతరెడ్డి మాజీ ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. నిరంతరం ప్రజల సమస్యలపై పోరాటాలు చేయాలని కోరారు. శక్తివంచన లేకుండా పార్టీ కోసం పని చేస్తానని ఈసందర్భంగా హనుమంతరెడ్డి పేర్కొన్నారు. అనంతరం హనుమంతరెడ్డిని మాజీ ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కొత్తచెరువు మండల కన్వీనర్ శ్యామ్ సుందర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా కన్వీనర్ నారాయణ, నాయకులు పెద్దన్న, పాదయాత్ర శంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం

నల్లమాడ: శీకివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కే. సూర్యనారాయణ (యర్ర సూరి) కుమార్తె కీర్తన వివాహం ఆదివారం రమేష్‌తో జరిగింది. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సీ. ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు దాదిరెడ్డి గంగిరెడ్డి, సర్పంచ్‌లు బొజ్జె నాయక్, ప్రసాద్, నాయకులు కుళ్లాయినాయక్, అశ్వర్థనారాయణ, షరీఫ్, గోవిందరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



ఓడీచెరువు సమీపంలో బైక్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మద్యంసేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, వాహనాల రికార్డుల పరిశీలన, పెండింగ్ చలానాల వంటి వాటిపై దృష్టిసారించామని తెలిపారు. ఇక పలు పోలీస్‌స్టేషన్లలో పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. శక్తి యాప్‌ను మహిళలను డౌన్‌లోడ్ చేసి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు.

ఘనంగా భగీరథ జయంతి వేడుకలు



భగీరథ విగ్రహం వద్ద పూజలు



భగీరథ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని భగీరథ సర్కిల్‌లో భగీరథ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి పూజలు చేపట్టారు. భగీరథ మహర్షిని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని, కఠోర దీక్ష ద్వారా దివి నుంచి భూమిపైకి గంగాదేవిని తీసుకొచ్చిన మహాపురుషుడు యావత్ ప్రపంచానికి నీటి దాహం తీర్చిన భగీరథ మహర్షి జయంతి పరమ పవిత్రమైనటువంటిదని, ఆయనను స్మరించుకోవాలని ఉప్పర, సగర సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలో స్థానికులు, ఉప్పర కులస్తులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: సగర కులస్థుల ఆరాధ్య దైవమైన భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి క్రాస్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఆ సంఘం నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు వెంకట రమణ, ఆదెప్ప, బాబయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఉప్పర కులస్తుల ఆరాధ్య దైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్రపటానికి తహసీల్దార్ వరదరాజు పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉప్పర సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



జీవామృతంతో నవధాన్యాల విత్తనాలను శుద్ధి చేసిన దృశ్యం

మడకశిరరూరల్: ఆమిదాలగొంది గ్రామంలో రైతు నారాయణ పొలంలో ఆదివారం నవధాన్యాల విత్తనాలు సాగు చేయించినట్లు ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, రైతుసాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యులు మల్లేశ్వరి, కీర్తన తెలిపారు. అలసంద, సజ్జ, అనుములు, ఆముదంతో పాటు 25 రకాల జీవ వైవిధ్య పంటల విత్తన గుళికలు వేయించినట్లు పేర్కొన్నారు. నవధాన్యాల సాగుతో పంటలు పండటంతో పాటు భూమి సారవంతంగా తయారవుతునంది తెలిపారు. ఇతర పంటలను సాగు చేసే మంచి దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏ–గ్రేడ్, ఏటీఎం మోడల్ ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథ్, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు జలధి ఉత్సవం

రొళ్ల: గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జలధి ఉత్సవం, అమ్మవారికి తలనీలాల సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జలధి ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు, కైవాడస్తులు తదితరులు కోరారు.

భక్తిశ్రద్ధలతో అష్టోత్తర పారాయణం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం



సత్యసాయి అష్టోత్తర పారాయణం చేస్తున్న శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్ర పేరుతో పుట్టపర్తికి శ్రీకాకుళం జిల్లా సత్యసాయి భక్తులు విచ్చేవారు. ఆదివారం ప్రశాంతి నిలయంలో వారు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత సామూహిక అష్టోత్తర పారాయణం గావించారు. భక్తిశ్రద్ధలతో సత్యసాయిని స్మరించారు. సాయంత్రం సత్యసాయి స్వరమాధురి పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. పిదప వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం



యోగసనాలు వేస్తున్న విద్యార్థులు

కనగానపల్లి: గ్రంథాలయ కార్యాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. విద్యార్థులు పుస్తక పఠనంతో పాటు ఆటలు పాటలతో ఉత్సాహంగా రోజంతా కాలక్షేపం చేస్తున్నారు. యోగాసనాలు, కోలాటం, క్యారమ్స్, చెస్ తదితర ఆటల్లో శిక్షణ అందిస్తున్నారు. వేసవి విజ్ఞాన శిబిరానికి రోజు 50 మంది దాకా పిల్లలు వస్తున్నారని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. విజ్ఞాన శిబిరం నిర్వహణకు యోగా గురువు సుబ్బరాయుడు, స్థానిక గ్రామస్తులు సహకరిస్తున్నారని పేర్కొన్నారు.

రేపు జాబ్‌మేళా

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, ఇబ్రహీం పట్నం ఐటీఐ కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆదివారం ప్రిన్సిపాల్ సుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు పలు కంపెనీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. వివరాలకు 9959890237 నంబరులో సంప్రదించాలని సూచించారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కృష్ణారెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి(70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి వెంకటరామిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ ఏవి రమణారెడ్డి, వైస్ ఎంపీపీ హనుమంతరెడ్డి, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు ఈశ్వరయ్య, రవినాయక్, మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు నాగరాజు, తిప్పారెడ్డి, ఓబిరెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్ నర్సరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రమీజా, హమీదా, రాబియా, అశోక్ ఆటోలో తనకల్లుకు బయలుదేరారు. అయితే నర్సరీ వద్దకు రాగానే ఆవు రోడ్డుకు అడ్డంగా వచ్చింది. దీంతో ఆటో అదుపు బోల్తా తప్పింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు కింద పడడంతో బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓడీచెరువు: గౌరాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..నల్లమాడ మండలం యర్రవంకపల్లికి చెందిన వేణుగోపాల్ బైక్‌పై గోరంట్లకు బయలుదేరాడు. గౌరాపురం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడని స్థానికిఉలు 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లినట్లు సమాచారం.

అ‘పూర్వ’ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 2000 నుంచి 2004 వరకు చదివిన విద్యార్థులు ఒకేచోట కలవడంతో వారి సంతోషాలకు అవధుల్లేకుండా పోయాయి. ఈ సందర్భంగా వారు చిన్ననాటి మధుర జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దివాకర్‌రెడ్డి, నారపరెడ్డి, సురేష్, నాగరాజు, రాధాకృష్ణ, ఆదినారాయణరెడ్డి, రమణారెడ్డి, సుధాకర్, ఆదెప్ప, రాజేశ్వరి, పర్వీనా, వసంతలక్ష్మీ తదితర ఉపాధ్యాయులకు కాళ్లు కడిగి, శాలువాలు కప్పి, పూలహారాలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

కమనీయం.. రథోత్సవం



బసవేశ్వరుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అమరాపురం: వీరశైవ లింగాయతుల ఆరాధ్య దేవుడు బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని ఆదివారం రాత్రి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరస్వామి ఆలయంలో స్వామికి వివిధ రకాల పూజలు చేశారు. రాత్రికి స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని రథంలో కొలువుదీర్చి వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం బసవన్న గుడి నుంచి మెయిన్ బజార్, బస్టాండ్ వరకు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా హర, హర బసవ రాజ్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. మేళతాళాలు, భజనలతో మహిళా భక్తులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం అందజేశారు.